విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

రేషన్ షాపులు తనిఖీ చేసిన జేసీ అపరాజిత

విశాలాంధ్ర-మచిలీపట్నం : రేషన్ దుకాణాలను జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక మాచవరంలో షాప్ నెంబర్ 29, పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలోని 73వ షాప్ లను తనిఖీ చేశారు. రేషన్ సరుకుల నాణ్యతను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో జేసీ వెంట డీఎస్ఓ వి.పార్వతి జాయింట్ కలెక్టర్ వెంట ఉన్నారు.

గంజాయి ముఠా అరెస్టు
18 కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-మచిలీపట్నం : గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను బుధవారం జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ జాషువా వివరాలను తెలిపారు. ఉంగుటూరు మండలం, పొట్టిపాడు టోల్గేట్ వద్ద గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో, ఎస్ఐ మద్యవర్తులతో సహా అక్కడికి వెళ్ళగా ఆదేశ్ రాము, గట్రెడ్డి నాగు, ధనాల అరుణ్‌కుమార్, పరపతి రాము గంజాయిని ఆర్టీసీ బస్సులో తరలిస్తూ ఉండగా ఎస్ఐ వారి సిబ్బంది వాహనాలు తనిఖీచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుండి 3.8 కేజీల లిక్విడ్ గంజాయిని, 18 కేజీల గంజాయిని, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని అల్లూరి సీతామరాజు జిల్లా, జీకే.వీది మండలం ధారకొండ గ్రామం నుండి తీసుకొని వస్తున్నట్లు, గంజాయిని బెంగుళూరులో అమ్ముదామని తీసుకొని వెళ్తుండగా ఎస్ఐ స్వాధీనం చేసుకున్నాడని ఎస్పీ తెలిపారు. వీరు పాత నేరస్థులని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుడివాడ డిపో నుండి 7 సర్వీసులు

విశాలాంధ్ర-గుడివాడ : సంక్రాంతి పండగల రద్దీ దృష్ట్యా గుడివాడ ఆర్టీసీ డిపో నుండి ఏడు కొత్త సర్వీస్ లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డిపో మేనేజర్ రాజేష్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌టిసి డియం కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు నూతన సర్వీసుల్లో ప్రయాణించే ప్రయాణికుల వద్ద నుండి సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామన్నారు. ప్రయాణికులు రద్దీని బట్టి అవసరమైతే మరిన్ని సర్వీసులు పెంచుతామన్నారు. పండగ రోజుల్లో హైదరాబాద్, బెంగళూరు లాంటి ప్రాంతాలకు వెళ్ళలనుకునే ప్రయాణికులు ఆన్‌లైన్‌తో ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

ధాన్యం కొనుగోలులో సహకార సంఘాలు కీలకపాత్ర

విశాలాంధ్ర-గూడూరు: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలైన ఆర్‌బికెలను పరిశీలించేందుకు బుధవారం జిల్లా సహకార అధికారి, తనిఖీ చేశారు. రైతులతో కొనుగోలు ప్రక్రియలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏజెన్సీలుగా జిల్లాలోని 169 సహకార సంఘాలు 236 ఆర్‌బీకేల అనుసంధానంతో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తోందని, మండలంలోని 9 సహకార సంఘాలు 17 ఆర్బికేల ద్వారా ధాన్యం కొనుగోలు ధాన్యం సేకరణ చేశామని, ఇప్పటివరకు మండలంలో 1445 మంది రైతుల నుండి 77,874.16 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మండలంలోని పాడైపోయిన రంగు మారిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని, ప్రతి మండల స్థాయిలో టెక్నికల్ అసిస్టెంట్లకు ట్రైనింగ్ ఇస్తారని, రైతుల నుండి పాడైన ధాన్యపు శాంపిల్స్ తీసుకొని మండల రెవెన్యూ అధికారి ద్వారా మండల స్థాయి టెక్నికల్ అసిస్టెంట్లతో పరీక్షలు చేసి, ధాన్యాన్ని కొంటామని అన్నారు. ఈ పర్యవేక్షణలో మండల సహకార ఇంచార్జ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్, సహకార సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు, ఆర్బికే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'డిజిటల్ విప్లవం'

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా భావిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభినందనీయులని మొవ్వ జడ్పిటిసి రాజులపాటి పార్వతి పేర్కొన్నారు. ఆమె కూచిపూడి శ్రీ సిద్దేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో బుధవారం సాయంత్రం 10వ తరగతి పిల్లలకు స్టడీ మెటీరియల్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లను గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, కొండవీటి అమర బాలేశ్వరరావు దంపతులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అన్నే లక్ష్మీకుమారి, కూచిపూడి రోటరీ క్లబ్ కార్యదర్శి పాగోలు రమేష్ బాబు, పాఠశాల మానిటరింగ్ కమిటీ చైర్మన్ జుజ్జవరపు మంగమ్మ, ఉపాధ్యాయులు గుంటూరు వెంకట సత్యప్రసాద్, పామర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'బాలమ్మ' విగ్రహానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర-కూచిపూడి : బాలా త్రిపుర సుందరి అమ్మవారి నూతన విగ్రహ ఏర్పాటును ఆ దేవాలయ పాలకమండలి గ్రామస్తుల సహకారంతో కొనసాగిస్తున్నారు. గంగా బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారి పురాతన విగ్రహం స్థానంలో కొత్త విగ్రహం ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. దీనికోసం మహాబలిపురం నుంచి స్థపతి (శిల్పి) కేశవన్ బుధవారం దేవాలయంలోని విగ్రహాన్ని పరిశీలించారు. ఆ విగ్రహ స్థానంలో కాంచీపురం నుంచి నల్ల పాలరాయి తీసుకొచ్చి ఘంటానాదం వచ్చే రీతిలో విగ్రహ ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని ధర్మకర్తల మండలి కార్యదర్శి భాగవతుల బాలకృష్ణ ప్రసాద్ తెలిపారు. ధర్మకర్తల మండల సభ్యులు కావూరి భానుమూర్తి, భాగవతుల బుజ్జిబాబు వేదాంతం రాధేశ్యాం, పసుమర్తి నారాయణమూర్తి, గ్రామస్తులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, అయాచితుల జయరవిశంకర్, పసుమర్తి హరినాథ శాస్త్రి, గ్రామస్తులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు..

గాయని కోట ఝాన్సీరాణి మృతికి సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : గాయనీమణి,పద్మశ్రీ ఘంటసాల చైతన్య వేదిక ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోట ఝాన్సీరాణి మృతికి తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు సంతాపం వెలిబుచ్చారు. కౌతాపూర్ణానందం సత్రంలోని రూమ్ లో పలు కళా సంస్థలు ఆమెకు శ్రద్ధాంజలి ఘటించి సంతాపం ప్రకటించాయి. ప్రసూన రామన్, సయ్యద్ అలీ, శింగంశెట్టి చంద్రశేఖర్, చీదెళ్ళ నాగేశ్వరరావు,దేవిడ్ రాజు,దండు చంద్రశేఖర్, బివి వీరభద్రరావు,కారుమంచి రాజు, జిలాని ఖాన్, మద్దెల శ్యాంప్రసాద్ తదితరులు ఝాన్సీరాణి భర్త కోట వెంకటేశ్వరరెడ్డికి సానుభూతిని తెలిపారు. శతాబ్ది గాయకుడిగా ఘంటసాల పాటలతో 100 కేంద్రాలలో 100 కార్యక్రమాలను నిర్వహిస్తున్న సమయంలో ఇటువంటిది జరగటం ఎంతో దురదృష్టమని వారు తెలిపారు.

రంగు మారిన ధాన్యం
మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ సంఘం డిమాండ్

డిప్యూటీ తహసీల్దార్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విశాలాంధ్ర-చల్లపల్లి : మాండోస్ తుఫాన్‌తో తడిసిన రంగు మారి, మొలకలు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ డిమాండ్ చేశారు. స్థానిక చంద్ర రాజేశ్వర వికాస కేంద్రంలో బుధవారం రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ తడిసి మొలకొచ్చిన ధాన్యాన్ని షరతులు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. తుఫాన్‌తో కోత కోసి పనుల మీద ఉండి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి, రైతులకు నష్ట పరిహారం అందించాలని కోరారు. ఎంటియు 10 61 ధాన్యం రకం గతంలో ఏ గ్రేడ్‌గా ఉండేదని ఇప్పుడు దాన్ని బిగ్రేడ్‌గా మార్చారని దీంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే 1061 రకాన్ని ఏ గ్రేడ్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఖరీఫ్‌కి ముందు రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించాలని కోరారు. రైతు సంఘాల నాయకుల సూచనలు పరిగణంలోకి తీసుకొని సహాయక చర్యలు రూపొందించాలని అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ధాన్యం తేమశాతం ఆర్‌బీకేల్లో ఒక విధంగా, మిల్లర్ల వద్ద ఒక విధంగా ఉంటుందని అలా కాకుండా ఆర్‌బీకేల్లో ఏవిధంగా తేమ శాతం నిర్ధారిస్తే దాని ప్రతిపాదికనే కొనుగోలు చేయాలని కోరారు. రైతులు అమ్మిన ధాన్యానికి పది రోజులలో డబ్బు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వేమూరి రత్నగిరిరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘం నాయకులు కొత్రపాటి ముఖర్జీ, కోడి శ్రీనివాసరావు, మల్లుపెద్ది బోసు, వీరాంజనేయులు, సిద్దా బత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంతో పోటీపడే విధంగా...

విశాలాంధ్ర-మచిలీపట్నం: సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్న ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యార్థులను తయారు చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. బుధవారం తపసిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కృష్ణాజిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్యాబ్ ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) తో కలిసి విద్యార్థులకు ట్యాబ్ లను పంపిణీ చేశారు. మచిలీపట్నం మండలం పరిధిలోని 38 అర్బన్, రూరల్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 1526 మంది విద్యార్థులకు బైజూస్ వారి కంటెంట్‌తో కలిపి రూ.31 వేల విలువైన 1526 ట్యాబులను పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తున్నారని, క్రింది దశ నుంచే విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారన్నారు. విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందించడం దగ్గర నుంచి ఫీజు రీయింబర్స్మెంట్ ను అందించడంతో పాటు నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ సీఎం జగన్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఏ ఒక్క విద్యార్థి ఆర్థిక సమస్యలతో చదువుకు దూరం కాకుండా ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ముఖ్యమంత్రి బాటలు నిర్మించారని కొనియాడారు. ప్రతి విద్యార్థి ఏ చీకూచింతా లేకుండా సంతోషంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. తపసిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మెరక పనులు చేయించడంతోపాటు సైకిల్ షెడ్ నిర్మాణం, సిరివెళ్లపాలెంలోని పాఠశాలకు ఆటస్థలం, కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సైకిల్ షెడ్ నిర్మాణం, అదనపు తరగతుల నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్, శాసనసభ్యులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెరా సుల్తానా, బందరు ఆర్టీవో ఐ కిషోర్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డిప్యూటీ డిఇఓ సుబ్బారావు, ఎంఈఓ ప్రసాద్, బందరు తాసిల్దార్ డి సునీల్ బాబు, గ్రామ సర్పంచ్ మస్తాన్‌రావు, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వర రావు, తాళ్లపాలెం మాజీ ప్రెసిడెంట్ వాలిసెట్టి రవిశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-గన్నవరం : కేసరపల్లి సచివాలయంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో లోకల్ విలేజ్ లెవెల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిహెచ్ లక్ష్మి మౌనిక, సచివాలయం కార్యదర్శి ఎం మౌనిక, లింక్ వర్కర్ కరుణ, మరియు ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పారంభించారు. బుధవారం స్థానిక ఎస్‌పిఎస్ పాఠశాలలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను వాటిని అందజేశారు. గొర్ల శ్రీను మాట్లాడుతూ గుడివాడ అర్బన్, రూరల్ ప్రాంతాలలో 1162 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ శేఖర్‌సింగ్, పట్టణ మహిళా సమైఖ్య అధ్యక్షురాలు మాదాసు వెంకటలక్ష్మి, హెచ్.ఎం రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరంలో...

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం నిమ్మగడ్డ రవీంద్రభవానీ ఆధ్వర్యంలో జగనన్న ఉచిత ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం పాఠశాల తల్లి తండ్రుల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో జరిగింది. నానాటికీ సాంకేతికంగా దూసుకువెళుతున్న సమాజంలో రేపటి పౌరులైన పేద విద్యార్థులు సైతం ధీటుగా ఉండాలన్న సంకల్పంతో జగనన్న పెద్ద మనస్సుతో పంపిణీ చేస్తున్న ఈట్యాబులు విద్యార్థుల పాలిట " జగనన్న వరం అని గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి కొనియాడారు. గన్నవరం ఎంతో అభివృద్ధి చెందుతోందని పాఠశాల తల్లి దండ్రుల కమిటీ చైర్మన్ నిడమర్తి రామారావు అన్నారు. వైస్ చైర్మన్ పట్నాల కళ్యాణి, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగాయతిప్పలో తోటబడి

విశాలాంధ్ర-చల్లపల్లి : వాణిజ్య పంటలకు వచ్చే కీటకాల నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన అధికారి చందు జోసఫ్ సుందరం, కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్త డాక్టర్ రేవతి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగాయతిప్పగ్రామంలో తోట బడి కార్యక్రమం జరిగింది కార్యక్రమంలో శాస్త్రవేత్త రేవతి మాట్లాడుతూ మిరప మరియు ఇతర కూరగాయ పంటల్లో ఆశించే కీటకాలు, తెగుళ్ల గురించి వివరిస్తూ వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. గతంలో నల్ల తామర పురుగు మిరప తోటలను నాశనం చేసిందో అదే నల్ల తామర పురుగు ప్రస్తుత కాలంలో రైతుల పొలాల్లో గమనించడం జరిగిందన్నారు. ఈ పురుగు ఉధృతి పెరగకముందే రైతులు నివారణకు సయాంట్రనిలిప్రోల్ 240 మిల్లీ లీటర్లు లేదా స్పైనో సాడ్ 60 మిల్లీలీటర్లు లేదా స్పైనిటోరం 200 మిల్లీలీటర్లు లేదా ఇమెడాక్లోప్రిడ్ ం ఫిప్రోనిల్ 50 గ్రాములు ఎకరానికి వారం రోజుల వ్యవధిలో మందును మార్చి మార్చి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగాయతిప్ప విహెచ్ఎ కేశవ లక్ష్మీ మరియు రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు హైజనిక్ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-చల్లపల్లి : రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.సుకుమార్లు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ వారు సమకూర్చిన హైజనిక్ కిట్ల పంపిణీ కార్యక్రమం చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగింది. సర్పంచ్, కార్యదర్శుల చేతులమీదుగా 20మంది పారిశుధ్య కార్మికులకు హైజనిక్ కిట్లను రెడ్ క్రాస్ ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణకుమారి, కార్యదర్శి సుకుమార్ లు మాట్లాడుతూ, కరోనా సమయం నుంచీ గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు, ఆరోగ్యసిబ్బందికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజలకు రెడ్ క్రాస్ సంస్థ ఎంతో సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, వైస్ ఛైర్మన్ పేరం మధుసూధనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : దోసపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత ట్యాబ్ లను మండల వై సి పి కన్వీనర్, ఎంపీపీ గోగం సురేష్ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద విద్యార్థుల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నాదని అన్నారు. అందుకు నిదర్శనంగా ఎనిమిదవ తరగతి నుండి ప్రత్యేక అవగాహన విద్యను అభ్యసించడానికి ఉచిత ట్యాబ్ లను ఎంతో ఖర్చుతో కూడుకున్నప్పటికీ ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి. శ్రీనివాస్,గ్రామ సర్పంచ్ విక్కృతి స్వాతి, వైస్ ఎం పి పి పొనుగుమాటి రజిని, ఎంపీటీసీ అశోక్ కుమారి, మాజీ జెడ్పిటిసి హరీష, హెచ్ఎం. రమణారావు, పేరెంట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహా పడిపూజ

విశాలాంధ్ర-కోడూరు : కోడూరు గ్రామంలోని వేంచేసి యున్న అయ్యప్ప స్వామివారి దేవస్థానం నందు మంగళవారం రాత్రి మహా పడిపూజను వ్యాపారస్తులు బూరగడ్డ బ్రదర్స్ ఆర్థిక సౌజన్యంతో ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీనివాసరావు గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.అయ్యప్ప స్వామి అభిషేకంలు పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక అలంకరణ,ప్రత్యేకపూజలు చేసి, రూ.లక్ష నాణేనలతో అభిషేకించారు. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తుల భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆనంతరం బుధవారం శ్రీఅయ్యప్ప మూర్తి విగ్రహన్ని కోడూరు పుర వీధులలో ఊరేగింపు ఉత్సవం చేపట్టారు.ఈ కార్యక్రమం అయ్యప్ప మాల ధారణ చేసిన భక్తులు,మరియు భక్తులు పాల్గొన్నారు.వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందచేసారు.

సచివాలయం సిబ్బందికి అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గుడివాడ : స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ ఆధ్వర్యంలో ఇంధన పరిరక్షణ చిట్కాలపై బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధనం, విద్యుత్ ఉపకరణాలను పొదుపుగా వినియోగించే పద్ధతులను నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, సిబ్బంది శేఖర్, కరుణాకర్‌బాబు, నాయుడు, ప్రభాకర్, తేజస్వి,దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఐడీబీఐ బ్యాంక్ రిటైల్ అమృత్ మహోత్సవ్ డిపాజిట్లపై 7.60 శాతం వడ్డీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఐడీబీఐ బ్యాంక్ తమ వడ్డీ రేట్లను డిపాజిట్లపై వృద్ధి చేసింది. రిటైల్ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇప్పుడు కేవలం 700 రోజుల డిపాజిట్లపై 7.60 శాతం వడ్డీ రేటు అందిస్తుంది. డిసెంబర్ 26 నుంచి పరిమిత కాలం పాటు ఈ ఆఫర్ వర్తిస్తుందని బ్యాంక్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

CHANGE OF NAME

I, SAGI RAVATHI (Old Name), W/o. Sagi Rambabu, R/o. D.No. 1-96/1, Near Ramalayam Kotha Eedara (V), Agiripalli (M), Krishna Dist., - 521 211. A.P. I, declare that I have changed my name as SAGI REVATHI (New Name). So, hereafter my name is known and called as SAGI REVATHI only.

డ్రైనేజీ పొంగి దుర్వాసన!

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రజలు పట్టించుకోని ఉన్నతాధికారులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : డీఆర్ఎం కార్యాలయం వెనుక వైపు డ్రైనేజీ పొంగి దుర్వాసన వెదజల్లుతూ ఉండటంతో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేలో పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ ప్రయాణికులు కూడా పరిశుభ్రత పాటించాలని అధికారులు సిబ్బంది పెద్దఎత్తున ప్రచారాలు చేస్తుంటారు. అయితే ఆచరణలో మాత్రం అంతంత మాత్రమే కనబడుతుంది. రైల్వే డివిజనల్ కార్యాలయంలో డిఆర్ఎం, ఏడిఆర్ఎమ్స్ ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది డివిజన్‌కు సంబంధించిన విధులు నిర్వహిస్తూ ఉంటారు. పలు పనులు నిమిత్తం వివిధ ప్రాంతాలను నుండి సిబ్బంది, సందర్శకుల వస్తుఉండటంతో వారి కోసం కార్యాలయం వెనుక భాగంలో కార్లు, టు వీలర్ పార్కింగ్ కోసం ఏర్పాటు చేశారు. ఆ పరిసరాల్లోనే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయం, పోస్టల్ ఆఫీసు, మరికొన్ని కార్యాలయాలు ఉన్నాయి. అయితే అక్కడ నిత్యం డ్రైనేజీ నిండిపోయి దుర్వాసన వెదజల్లుతూ ఉంటుంది దాంతో ఆ దుర్వాసన నుండి విముక్తి కోసం పలు అగచాట్లు పడుతుంటారు. గతంలో చిన్న వర్షానికి ఆ ప్రాంతం మునిగిపోయ్యే పరిస్థితి ఉండేది. అటువంటి సమయంలో అధికారులు స్పందించి ఆ ప్రాంతాన్ని ఎత్తు పెంచారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచకపోవటంతో చిన్నపాటి వర్షం వచ్చినా, డ్రైనేజీలో స్టీల్ తొలగించక పోవటం వలన పాత పైపులైన్‌లు ఉండటం వంటి పలు కారణాలతో నిత్యం డ్రైనేజి పొంగి దుర్వాసన బయటికి రావటమే కాకుండా ఆ నీళ్లు కూడా ఆ ప్రాంతాన్ని అంతా కలుషితం చేస్తున్నాయి. దీంతో సిబ్బంది ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఐఓడబ్ల్యు విభాగం పర్యవేక్షణా లోపంతో ఇటువంటి పరిస్థితి నెలకొందని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు పక్కనే ఉన్నతాధికారుల కార్యాలయాలు ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం.అధికారులు తక్షణం స్పందించి ఈ మురికి కూటాల నుండి రక్షించాలని కోరుతున్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణలో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీకి మొదటి ర్యాంకు

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిని అందించడంలో కెఎల్ విశ్వవిద్యాలయం అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఏఐసిటిఈ నుండి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు లభించిందని విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ జి.పార్థసారధివర్మ తెలిపారు. విజయవాడలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో అయన మాట్లాడుతూ విద్యార్థులకు అంతర్జాతీయ, జాతీయ కంపెనీలలో ప్లేసెమెంట్స్ వచ్చేలా, ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించేలా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. నైపుణ్యాభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ ఇంటర్న్ షిప్ లు, ఉద్యోగాల కల్పనల ఫలితాలలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న సంస్థగా 2022 కు కేంద్రం ప్రకటించిన కెఎల్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అధ్యాపకులు ఉత్తమ అవార్డులను పొంది నట్లు తెలిపారు. కెఎల్ హైదరాబాదు క్యాంపస్‌లో మెంటార్‌లుగా వ్యవహరించిన అధ్యాపకులు ఎడబ్ల్యుఎస్‌కు సిఎస్ఇ ప్రొఫెసర్ డాక్టర్ కె శ్రీనివాస్, డాక్టర్ సిహెచ్ రాధికారాణి, జూనిపర్‌లకు ఉత్తమ బోధన, మెంటార్లుగా అవార్డులు అందుకున్నారని తెలిపారు. డైరెక్టర్, డాక్టర్ జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారు చౌకగా కార్మికశాఖ భూమిలో వైసీపీ పాగా!

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్) : విజయవాడ సితార సెంటర్ సమీపంలో కార్మిక శాఖకు చెందిన అత్యంత విలువైన 1,850 గజాల భూమిని వైసీపీ కార్యాలయానికి కారు చౌకగా లీజుకు ఇవ్వడాన్ని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. వన్ టౌన్ లెనిన్ భవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన అత్యంత విలువైన స్థలాన్ని ఏడాదికి వెయ్యి రూపాయల చొప్పున 33ఏళ్లకిలీజుకు ఇస్తారా? అని ప్రశ్నించారు. అధికారం ఉందని అడ్డగోలుగా జీవో నెంబర్ 761 జారీ చేసి ప్రభుత్వ భూములను స్వాహా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. వైసీపీ సర్కారు వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఆ స్థలంలో కట్టాల్సింది వైసీపీ జిల్లా కార్యాలయం కాదని, ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్కు లేదా షాపింగ్ కాంప్లెక్స్ లాంటివి నిర్మించాలని సూచించారు. తక్షణమే వైసీపీ కార్యాలయానికి లీజుకు ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటస్థలం కేటాయించాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ : వాంబేకాలనీలోని పాఠశాల విద్యార్థులకు ఆటస్థలం కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యారంగంలోనే కాకుండా శారీరకంగా కూడా బలపడాలి అంటే విద్యార్థి దశలోనే విద్యార్థులకు ఆట స్థలాన్ని విద్యార్థులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వాంబే కాలనీ నందు ఉన్న అప్పర్‌ప్రైమరీ స్కూల్ ను జీవో నంబర్ 117 పేరుతో 3, 4, 5 తరగతులు విలీనంతో అక్కడున్నటు వంటి విద్యార్థులు అందరూ కూడా ఆట స్థలం లేకుండా పోతుందన్నారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు శారీరకబలం పెంచుకోవడానికి ఆటస్థలం ఎంతో ముఖ్యమైనదన్నారు. అదే ఆట స్థలాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఆట స్థలాన్ని కేటాయించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించాడు. ఈ కార్యక్రమంలో ఐస్ఫ నగర నాయకులు అయ్యప్ప, సుధీర్, రంజిత్, జగదీష్, సాయి కుమార్ తదతరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

నేడు సీపీఐ ఆధ్వర్యంలో 'చలో రాజభవన్'

విశాలాంధ్ర-విజయవాడ : గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని, ఫెడరల్ వ్యవస్థను పరిరక్షించాలని కోరుతూ సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు గురువారం ఉదయం 10.30 గంటలకు 'చలో రాజభన్' కార్యక్రమం చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్‌పేటలోని దాసరి భవన్ నుంచి ప్రారంభించే ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలో 8వ తరగతి విద్యార్థులకు జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మండలంలోని పుట్రేల జడ్పీ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపట్టిన పలు పథకాలను ఈ సందర్భంగా వివరించారు. ట్యాబ్‌లలో పొందుపరిచిన బైజూస్ యాప్ ద్వారా ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందిపుచ్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఆమెతోపాటు ఎమ్మెల్యే కె.రక్షణనిధి, ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, సర్పంచి కారుమంచి స్వాతి, జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎమ్మీవో సీహెచ్.రామకృష్ణ, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, హెచ్‌ఎం జయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జడ్పీ చైర్మన్ హారికను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

పేద విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు

విశాలాంధ్ర-ఎ.కొండూరు : పేద విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేయాలనే ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణ నిధి పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,10వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్ లు, టెస్ట్ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతిలో ప్రవేశించిన ప్రతి విద్యార్థికి ప్రతి సంవత్సరం మారిన కంటెంట్‌తో కూడిన ఉచిత ట్యాబ్‌లు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇది డిజిటల్ విద్యా విప్లవానికి నాంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు, జడ్పీటిసి భూక్యా గనియా, సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీటీసీ కోట పుల్లారావు, మాజీ సర్పంచ్ దాసరి సతీష్, ఎంపీడీవో పి వి ఎస్ నాగేశ్వరరావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంఈఓ ఎం. రాజశేఖర్, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాలసాని వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం ఆదిశేషు, సీఆర్పీలు నాగ పండు, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాబ్స్ పంపిణీ

విశాలాంధ్ర-వీరులపాడు: జుజ్జూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి విద్యార్థులకు ఈ - ట్యాబ్ లను ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మీద రూ.55 వేల కోట్ల పైచిలుకు ఖర్చుపెట్టి నాడు -నేడు కార్యక్రమం ద్వారా పాడుబడిన ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాల కంటే దీటుగా తీర్చిదిద్దారన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు వండుతున్న ఆహారాన్ని పరిశీలించారు, తదనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కొంతమంది విద్యార్థులు కుక్ ఏజెంట్ పై ఆరోపణలు చేశారు, భోజనం సరిగా ఉండటం లేదని ఎమ్మెల్యే కి తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కుక్ ఏజెంట్ ని మందలించి ఇకపై భోజనం విషయంలో ఏ విధమైన ఆరోపణలు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోటి, ఎంఈఓ ఎల్.చిట్టిబాబు ఎంపీపీ కోటేరు లక్ష్మి, జడ్పీటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, మండల కన్వీనర్ ఆవుల రమేష్,మాజీ జెడ్పిటిసి సభ్యుడు ముత్తారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

ఇండియన్ లాయర్స్‌చే 2023 డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో 2023 సంవత్సర దైనందిని (డైరీ) ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నగరంలోని సివిల్ కోర్టుల ప్రాంగణంలో ఉన్న బార్ అసోసియేషన్ హాల్ నందు జరిగింది. ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ విష్ణువర్ధన్, సీనియర్ న్యాయవాది చేకూరి శ్రీపతిరావు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం కోసం ఐఏఎల్ దేశ వ్యాపితంగా నిరంతరం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నారని చెప్పారు. సుప్రీంకోర్టు,హైకోర్టుల వివరాలతో ఉన్న ఈ డైరీ న్యాయవాదులకు ఉపయోగపడుతుందని అన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి గంధం శ్రీనివాస్, ఐఏఎల్ ప్రతినిధులు బోను జయమ్మ, ఎమ్ ఎ షరీఫ్, అబ్దుల్ రజాక్, కే ఎస్ సుధాకర్ రాజు, బి బి ఏ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమరావతి బోన్సాయ్ గార్డెన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : నగరంలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న రాజీవ్‌గాంధీ మున్సిపల్ పార్క్‌లో అమరావతి బోన్సాయ్ గార్డెన్‌ను బుధవారం ప్రారంభించినట్లు అమరావతి బోన్సాయ్ సొసైటి అధ్యక్షురాలు అమృత కుమార్ తెలిపారు. 2018లో ప్రారంభమైన అమరావతి బోన్సాయ్ సొసైటీ మొక్కల పెంపకంపై అనేక అవగాహన సదస్సులు, శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి బోన్సాయ్ మొక్కలను తెచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అమరావతి బోన్సాయ్ సొసైటి ఉపాధ్యక్షురాలు ఎర్నేని పద్మజ, కార్యదర్శి పత్తి నాగలక్ష్మి, సంయుక్త కార్యదర్శి గమిని సునీత, కోశాధికారి కంచర్ల దుర్గా సౌజన్య, ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులు డాక్టర్ కోనేరు లక్ష్మీ నీలిమ, నర్రా పద్మప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాలను సాధించండి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : గృహనిర్మాణాలు, నాడు-నేడు పనుల్లో లక్ష్యాలు, స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి వారం వారిగా అధికారులకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసి పనుల ప్రగతిని చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి బుధవారం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కలను నిజం చేసేందుకు జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టటం జరిగిందని, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో 12,264 గృహ నిర్మాణాలను పూర్తి చేసే లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఇప్పటికే 6,662కుపైగా పూర్తి చేయగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని, వీటిలో రూఫ్ కాస్టింగ్ స్థాయి నుండి తుది దశలో ఉన్న సుమారు 3వేల గృహాలను, రూఫ్ లెవల్‌లో ఉన్న 2వేల గృహాలను రూఫ్ కాస్టింగ్ స్థాయికి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాల్సిన భాధ్యత అధికారులపై ఉందన్నారు. దశల వారి పనులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసిన వెంటనే ఏ స్థాయిలోను బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లింపు జరుగుతుందని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్.నుపూర్ అజయ్, విజయవాడ సబ్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్‌వో కే.మోహన్‌కుమార్, నందిగామ ఆర్‌డీవో ఏ.రవీంద్రరావు, తిరువూరు ఆర్‌డీవో వైవీ.ప్రసన్నలక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీదేవి, డీఇవో సీవీ.రేణుక పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఇంటి పన్ను కట్టకుంటే సామాన్యులకు నోటీసులు జారీ చేయటం, వారిపై ఒత్తిళ్లు తెచ్చి, పన్నులు వసూలు చేయటం పంచాయతీ అధికారులు చేయటం సహజంగా జరుగుతోంది. స్థానికంగా ఆదాయం సమకూర్చుకునేందుకు ఉన్న మార్గాలు అన్వేషించాలంటూ కేంద్రప్రభుత్వం సైతం పంచాయతీలకు మార్గదర్శకాలు సూచిస్తోంది. సాక్షాత్తు వివిధ శాఖల అధికారులు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యాలయాలే రూ.లక్షల్లో బకాయిలుపడి, పంచాయతీకి చెల్లించకుంటే... ఇది త్వరితగతిన చెల్లించకుంటే కోర్టుకు వెళతారంటూ పంచాయతీ అధికారులు ఇతర శాఖల అధికారులకు నోటీసులు జారీ చేస్తే... ఇదే విస్సన్నపేటలో తాజాగా జరిగింది. విస్సన్నపేటలో వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయాలకు సంబంధించిన ఇంటి పన్నును కొన్నేళ్లుగా పంచాయతీ అధికారులకు జమ చేయటంలేదు. ఇది పెరిగి రూ.లక్షల్లోకి చేరుకోవ టంతో ఉన్నతాధికారులు స్థానిక అధికారులపై వసూళ్లకు ఒత్తిడి తెచ్చారు. దీంతో స్థానిక పంచాయతీ అధికారులు, బకాయిలు ఉన్న అధికారులకు నోటీసులు జారీ చేశారు.

మండలంలోని దాదాపు అన్ని శాఖల కార్యాలయాలూ బకాయిలు పడి, నోటీసులు అందుకున్న జాబితాలో ఉండటం విశేషం. మండలంలో మొత్తం రూ.8,28,536ల బకాయిని వివిధ శాఖల అధికారులు పంచాయతీకి జమ చేయవలసి ఉంది. విస్సన్నపేట పోలీసుశాఖ రూ.2,25,255లతో అగ్రభాగంలో ఉంది. ఎన్నెస్పీ అధికారులు రూ.1,85,320, వివిధ సంక్షేమశాఖల వసతిగ్రహాలు రూ.2,51,013 చెల్లించాల్సి ఉంది. అన్నిశాఖలకు పెద్దన్న పాత్ర పోషించే రెవిన్యూశాఖ రూ.25,947, పంచాయతీపై పర్యవేక్షణాధికారులు ఉన్న మండలపరిషత్తు కార్యాలయ అధికారులు రూ.1,07,160, పంచాయతీరాజు ఇంజనీరింగ్ అధికారులు రూ.24,146 చెల్లించాల్సి ఉంది. వ్యవసాయశాఖ అధికారులు రూ.6,591 చెల్లించాల్సి ఉంది. బకాయిలు ఉన్న అన్నిశాఖల కార్యాలయాలకూ నోటీసులు జారీ చేశామని పంచాయతీ కార్యనిర్వహణా ధికారి బీఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. వెంటనే ఈ బకాయిలు చెల్లించకుంటే కోర్టును ఆశ్రయించనున్నట్లు పేర్కొన్నామన్నారు.

విద్యార్థులకు ప్రతిభపై అవగాహన

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహనా సదస్సు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె. రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ విభాగానికి చెందిన ప్రముఖ ఆంగ్ల బాషా నిపుణులు, మోటివేటర్ ఆర్.ఓ.యల్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులుఒకలక్ష్యాన్నిఏర్పరుచుకుని దానిని సాధించటానికి నిరంతరం కృషి చేయాలనీ, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్.శశిధర్ మాట్లాడుతూ బి.టెక్ నాలుగు సంవత్సరాల కోర్స్ చాలా ముఖ్యమైనదని విద్యార్థులు అవగాహనా సదస్సుల ద్వారా ఆత్మ విశ్వాసం పెంపొందించుకుని లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమము లో బి.టెక్, పాలిటెక్నిక్, ఎంబీఏ ఎంబీఏ, విద్యార్థిని విద్యార్థులు, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫుడ్‌ప్రాసెసింగ్‌లో అవకాశాలు

విశాలాంధ్ర-విజయవాడ : ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఆ రంగంలో ఉద్యోగులుగా , పారిశ్రామిక వేత్తలు స్థిరపడవచ్చని తన్వి ఫుడ్స్ ఇండియా అధినేత నాగవీర్ అదుసుమిల్లి తెలిపారు. పీబీ సిద్ధార్థ ఎంబీఏ విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగి నిరంతర శ్రమ, పరిష్టమైన వ్యూహాలతో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విద్యార్థులు, పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

గడువులోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ రాయితీ

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీటి, డ్రెయినేజీ, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల 31వ తేదీలోపు చెల్లిస్తే వడ్డీ రాయితీ ఇవ్వటం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం తెలిపారు. 2022-23లో 2వ అర్థ సంవత్సరానికి 2022 అక్టోబర్ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు బకాయి ఉన్న పన్నులు చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. వన్‌టౌన్ కలరా ఆసుపత్రి వద్ద ఉన్న సర్కిల్-1 కార్యాలయం వద్ద ఉన్న 2 కౌంటర్లు, భవానీపురం హెచ్‌బీ కాలనీలో కౌంటర్లలో చెల్లించాలని తెలిపారు. సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో, పాయకాపురంలోని అప్నా బజార్ వద్ద ఉన్న పాత బీసీ కౌంటర్‌లో, సింగ్‌నగర్‌లోని పాత బీసీ కౌంటర్‌లో చెల్లించాలని, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలోని 3 కౌంటర్లలో, గుణదల్లోని ఇఎస్ఐ ఆసుపత్రి వద్ద ఉన్న పాత రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో, స్టెల్లా కళాశాల వద్ద ఉన్న సాయిబాబా గుడి రోడ్డులోని వీఎంసీ కాంప్లెక్స్‌లోని కౌంటర్‌లో, కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎం స్కూల్ వద్ద ఉన్న సచివాలయం కౌంటర్‌లో పన్నులు చెల్లించాలని తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో గృహ అవసరాలకు తరలిస్తున్న రెండు మట్టి ట్రాక్టర్లను అందుకు సంబంధించిన అనుమతులు లేవంటూ రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ నుంచి విస్సన్నపేటలో ఒకచోట ఇల్లు నిర్మిస్తుండగా ఈ మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయమై అందిన సమాచారంతో అధికారులు రెండింటినీ స్వాధీనం చేసుకుని, కార్యాలయానికి తరలించారు. పెద్దస్థాయిలో భవనాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇటుక బట్టీల వ్యాపారులు రెవిన్యూ కార్యాలయం మీదుగా ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నా, ఎవరూ పట్టించుకో వటంలేదని, ఇల్లు కట్టుకుంటూ తెచ్చుకునే మట్టి ట్రాక్టర్లపై భారీగా జరిమానాలు వేస్తూ పేదలను అవస్థల పాలు చేస్తున్నట్లు పలువురు పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ ఉద్యోగుల పాదయాత్ర కు సంఘీభావం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు రామారావు, విష్ణు, శ్రీనివాస్ లు వైజాగ్ నుండి తిరుపతి కి చేపట్టిన పాదయాత్ర విజయవాడ చేరుకుంది. ఈ సందర్భంగా జగ్గయ్యపేట లైమ్ మైన్స్ కార్మిక సంఘాల నాయకులు విజయవాడ వెళ్లి వారిని కలిసి సంఘీభావం తెలిపారు. వీరి పాదయాత్ర దిగ్విజయం గా ముగి యాలని ఆకాంక్షి స్తూ శుభాకాంక్షలు తెలిపారు. వారికి కొంత నగదు, మెడికల్ కిట్టు ను అందజేశారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆ పే లా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జే వి ఎస్ డి ప్రసాద్, సురేష్, విక్రమ్, రామ్ ప్రసాద్, సి ఐ టి యు నాయకులు రాజు, వై సి పి యూనియన్ నాయకులు దేవరాజు, బి ఎమ్ ఎస్ నాయకులు హేమ నాయక్, విశ్రాంత ఉద్యోగులు నారాయణ, భీమ రాజు, ఫిలిప్, ఆజాం, సారథి తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో మాజీ ఎంపీపీ సుజాత

విశాలాంధ్ర-వీరులపాడు: ఏకపక్ష నిర్ణయంతో మండల కేంద్రాన్ని తరలించటం హేయమైన చర్యని మాజీ ఎంపీపీ వట్టికొండ సుజాత అభిప్రాయపడ్డారు. మండల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష లో బుధవారం ఆమె పాల్గొన్నారు. మండల కేంద్రం తరలింపుకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే నిరాహార దీక్షలు వీరులపాడు గ్రామానికి చెందిన మహిళలు వట్టికొండ సుజాత,వాసిరెడ్డి కోమలి,వాసిరెడ్డి కమల,బాదినేని కృష్ణకుమారి ,కొండవీటి వాణి,సూర్యదేవర విజయ, చేకూరి పద్మ, బాణావత్ మంగమ్మ, బాణావతి మమత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ చేసిన ఆర్డీఓ ప్రసన్న

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక రాజపేట బెస్తబజార్ లోని రేషన్ దుకాణాన్ని తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారిణి ప్రసన్న లక్ష్మీ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిత్యవసర సరుకులను ఎండీఎం వేన్ల ద్వారా కార్డు దారుల ఇళ్లకు సరఫరా చేస్తున్న బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వలను పరిశీలించి డీలర్ కు ఆర్డివో పలు సూచనలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు నిల్వ వివరాలను రికార్డుల్లో నమోదు చేయడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలు పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసిల్దారు శ్వేత పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోండి : నర్సిరెడ్డి

విశాలాంధ్ర-తిరువూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం చేపట్టిన పనులను వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. బుధవారం మునుకుళ్ళ సచివాలయంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. గ్రామ అవసరాల దృష్ట్యా స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ పనులు చేపట్టాలని నర్సిరెడ్డి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మునుకుళ్ళ పీఏసీఎస్ చైర్మన్ వెదురు గోపిరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నల్లగట్ల మున్నీ, ఎంపీటీసీ సభ్యులు నర్సింగ్ వెంకట కృష్ణ, పంచాయతీ సెక్రటరీ సురేష్, గ్రామ సర్పంచ్ లు సిరికొండ కుమారి, మల్లేల పీఏసీఎస్ చైర్మన్ కలకొండ రవి కుమార్, వంగూరి మరియమ్మ, ఎన్ఆర్ఈజీఎస్ పరిశీలికులు శ్వేత సచివాలయ పంచాయతీ కార్యదర్శులు అంజనాదేవి రమేష్ పాల్గొన్నారు.

22న శారదాంబ మహిళా సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్) : సత్యనారాయణపురంలోని శారదాంబ మహిళా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఎన్నికల అధికారి అర్హులైన ఓటర్ల జాబితాను ఈ నెల 30న ప్రకటిస్తారని, ఓటర్ల తుదిజాబితా జనవరి 6వ తేదీన ప్రకటిస్తారని తెలిపారు. ఓటర్ల తుదిజాబితాను జనవరి 9వ తేదీన ఎన్నికల అధికారికి అందజేస్తారని, ఆయన ఎన్నికల నోటీసులను జనవరి 11న జారీ చేస్తారని తెలిపారు. పోటీదారులు జనవరి 13వ తేదీన నామినేషన్లు స్వీకరణ, 14న పరిశీలన, ఉపసంహరణ 15న అనుమతిస్తారని పేర్కొన్నారు. కాగా జనవరి 22వ తేదీన ఎన్నికల జరుగుతాయని తెలిపారు.

మాంసప్రియుల్లో విజయవాడ ముందంజ

విశాలాంధ్ర-విజయవాడ : తాజా చేపలు, మాంసంలో ప్రపంచంలోనే అతిపెద్ద పూర్తి సమగ్ర ఆన్‌లైన్ ఇ-కామర్స్ 7 బ్రాండ్ ఫ్రెష్ టు హోమ్ ప్లాట్‌ఫారమ్‌లో తన కస్టమర్ల ప్రాధాన్యతల గురించి కొన్ని వాస్తవాలుతో కూడిన ట్రివియాను ప్రకటించింది. అది బెంగళూరు జనాభాకు 3 రెట్లు మంది మాంసం ఇ-కామర్స్ మార్కెట్ ప్లేస్ అందుకుంది. అలాగే, సబ్‌స్క్రిప్షన్ విషయంలో ఈ నగరం నిమిషానికి 68 ఆర్డర్లను అందుకుంది. ఈ సంవత్సరం అన్ని ఉత్పత్తి వర్గాలలో 3.6 కోట్లకు పైగా డెలివరీలను ప్రారంభించింది. టైర్ 2 నగరాల్లో, ఉత్తరాన జైపూర్, దక్షిణాన విజయవాడ ఇతర టైర్ 2 నగరాలతో పోలిస్తే మార్కెట్‌ప్లేస్‌లో అత్యధికంగా ఆర్డర్ చేసిన అగ్ర నగరాలుగా నిలిచాయి. రెండు త్రైమాసికాల్లో బ్రాండ్ 125% పైగా వృద్ధిని సాధించడంతో విజయవాడలోని మాంసం ప్రియులు ఎక్కువమంది వున్నట్లు ఫ్రెష్ టు హోమ్ వెల్లడించింది.

రేపటి నుంచి యూనియన్ బ్యాంక్ విలీనాన్ని నిరసిస్తూ రిలేనిరాహార దీక్షలు

విశాలాంధ్ర- విజయవాడ : లాభాల్లో నడుస్తున్న యూనియన్ బ్యాంక్ మధురానగర్ శాఖను ఏలూరు రోడ్డుని మాచవరం బ్రాంచ్‌లో విలీనం చేసే ప్రయత్నాలను నిరసిస్తూ శుక్రవారం నుంచి మధురానగర్ బ్యాంక్ ముందు ఖాతాదారులతో రిలేనిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు ఈ రీలే నిరాహార దీక్షలో పాల్గొనాలని కోరారు. పేద, మధ్య తరగతి ప్రజలకు, డ్వాక్రా గ్రూపు మహిళలకు ఈ శాఖా అందుబాటులో ఉందని తెలిపారు. మధురానగర్ నుంచి బస్‌సౌకర్యం కూడా లేని మూడు కీలో మీటర్ల దూరంలో ఉన్న బ్రాంచ్‌లో విలీనం చేయటం తగదన్నారు. బ్యాంక్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్లమెంట్‌మెంట్ సభ్యులకు కూడా లేఖలు రాసినట్లు పేర్కొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన కల్పించాలని, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు బీ.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక లెనిన్ సెంటర్‌లోని అలంకార్ హోటల్‌లో నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, విశాపట్నం, కృష్ణాజిల్లాల సహాయ సంచాలకులు, డ్రగ్ డీ సెంటర్స్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటి వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఇటీవల సామాజిక న్యాయం, సాధికారిత విభాగం దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో దేశంలో 272 జిల్లాలను మాదక ద్రవ్యాలు అధికంగా వినియోగిస్తున్న జిల్లాలుగా గుర్తించటం జరిగిందన్నారు. వీటిలో కృష్ణా, ఉభయ గోదావరి, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, విశాఖపట్నం జిల్లాలు ఉన్నాయని తెలిపారు. ఆయా జిల్లాలకు చెందిన అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంచాలకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డీడీ రవీంద్ర, సంచాలకులు సౌమ్యజైన్, సహాయ సంచాలకులు రియాజ్‌ఫాతిమా, స్టేట్ కో-ఆర్డినేటరర్ ఉమారాజ్, కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల పని చేస్తున్న సహాయ సంచాలకులు, డ్రగ్స్ డీ సెంటర్లలో పని చేస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిదులు పాల్గొన్నారు.

అర్జునరావు సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-విజయవాడ : మానవులంతా ఒకటేనని, మానవుల మధ్య అంతరాలు ఉండకూడదని, కుల-మత బేధాలు సమసిపోవాలని, వ్యక్తి గౌరవం పెంపొందాలని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మనుగడ సాధించాలని, గాంధీ-గోరా ఆశయాలే సమసమాజ నిర్మాణానికి, మానవత్వానికి ఆదర్శాలని, తన జీవితాంతం సాంఘిక సంస్కరణలకై, అంటరానితనం నిర్మూలనకై కృషి చేసిన వ్యక్తి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, నాస్తికులు రావూరి అర్జునరావు అని పలువురు వక్తలు ఏకకంఠంగా ప్రశంసించారు. బుధవారం నాస్తిక కేంద్రం నిర్వహించిన రావూరి అర్జునరావు సంస్మరణ సభలో పాల్గొన్న మహిళా శిశు అభివృద్ధి శాఖ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ శారదా ఆలీఖాన్ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి కులాంతర, వాటిని నివారించడానికి ప్రముఖ నాస్తికులు గోరా, శ్రీ అర్జునరావు వంటి వ్యక్తులు తీసుకున్న ఆచరణాత్మక కార్యక్రమాలే అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈనాడు అర్జునరావు భౌతికంగా మన మధ్య లేకపోయినా కూడా ఆయన ఆచరణాత్మక కార్యక్రమాలు అందరికీ ప్రేరణదాయకం అన్నారు. ప్రముఖ జర్నలిస్టు రామచంద్రమూర్తి మాట్లాడుతూ గోరా ఆశయాలని అర్జునరావు తు.చ. తప్పకుండా జీవితాంతం ఆచరించిన మహానుభావుడని, ఆయన్ని కోల్పోవడం సంస్కరణ ఉద్యమానికి ఎంతో లోటు అని పేర్కొన్నారు. సభలో సర్వోదయ ట్రస్టు విజయవాడ అధ్యక్షులు డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్, సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ సెక్రటరీ మోతుకూరి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ హరిజన్ సేవక్ సంఘ్ అధ్యక్షులు వజీర్ తదితరులు రావూరి అర్జునరావు తన 105 సంవత్సరాల జీవితకాలం -మానవత్వం, సమానత్వం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసమే కృషి చేసారని ప్రశంసించారు. సభకు డాక్టర్ సమరం అధ్యక్షత వహించారు. ఈ సభలో పలువురు సామాజిక సేవకులు, అర్జునరావు అనుచరులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. తొలుత సూయజ్ వేదికపైకి అతిథులని స్వాగతించగా, డాక్టర్ వసర్ అర్జునరావుగారి జీవితంలో ముఖ్య ఘట్టాలని వివరించారు. సాదికి వందన సమర్పణ చేశారు.

CHANGE OF NAME

I, SHAMEEM SULTHANA (Old Name) W/o. SYED RIYAZ, R/o.9-55-15, Rallavari Street, Panja Centre, Mahanthipuram, VIJAYAWADA - 01, A.P, Have change My Name to **SYED SHAMEEM SULTHANA** (New Name). Here after My Name is known as **SYED SHAMEEM SULTHANA**

తిరువూరు నగర పంచాయతీ

టెండరు రద్దు నోటీసు

ఆర్.ఓ.సి నెం.102/2022/ఇ1, తేది 28-12-2022.

తిరువూరు నగర పంచాయతీ నందు **ది:28-12-2022**న ప్రచురితమైనటువంటి టెండరు ప్రకటన టెక్నికల్ సమస్య వలన టెండర్లు పిలుచుట నిలుపుదల చేయడమైనది. కావున సదరు విషయము గమనించగలరు.

కమీషనర్,
తిరువూరు నగర పంచాయతీ.